# తుస్సుమన్న వాహనయోగం

శ్రీ వెంకట సుబ్బయ్య చిరకాలపు వాంఛ నెరవేరింది. కొత్తగా రంగు వేసిన ఓ పాత కారు ఏభైవేలకి కొనేశాడు. కారు ధగ ధగ మెరిసి పోతుంది. పక్కింటి ఇల్లాలు ప్రహరీ గోడ దగ్గర నిలబడి ఆ కారు మెరుపు చూసి ఆనందపడి, తన భర్త కూడ తన ఆనందంలో పాలు పంచుకోవాలని, "ఏమండీ ఓసారి యిటురండి ఆ కారు పాతదైనా ఎంతగా మెరుస్తోందో చూడండి!" అంది. అతను కూడా చూసి "భూమ్మీద అతిగా మెరుస్తూన్న వస్తువులూ, ఆకాశంలో గ్రహణం పట్టిన గ్రహాలూ చూడడం శ్రేయోదాయకం కాదు, నడు లోపలికి!" అన్నాడు, ధైర్యం చేసి.

కారుకి చెయ్యవలసిన పూజాకార్యక్రమం ముగిసిన తర్వాత, బాగా అనుభవంగల ఓ ముసలి డ్రైవర్ని పక్కన కూర్చోబెట్టుకుని, స్టీరింగ్ పట్టుకుని డ్రైవింగ్ మొదలుపెట్టాడు సుబ్బయ్య.

"అయ్యగారూ! ఆ స్టీరింగ్ పట్టుకున్న మీరు ఒక చక్రధారి! ధైర్యంగా నడపండి. ఎవరు ఎదురుగా వచ్చినా, ఆఖరి మన అమ్మగారయినా సరే భయపడకండి! కారు ఒకవేళ దేనినైనా గుద్దేసినా, కార్లోంచి దూకేసి పారి పోకండి (సుబ్బయ్య పారిపోతే తన మీదకి వస్తుదని!). ఆయుర్దాయం మూడినవాడు, మన కారువలన కాకపోతే ఇంకో కారణం వలన పోతాడు! పుట్టిన ప్రతీ జీవి గిట్టక తప్పదన్న విషయం మీకు తెలీంది కాదు!"

"అబ్బ! నీ మాటలు వింటూంటే, మొత్తం డ్రైవింగ్ వచ్చేసినట్లుందయ్యా! శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేసినట్లు చెప్పావు".

"అబ్బ! అప్పుడే మూడు కిలోమీటర్లు నడిపేశారు, ఏదైనా హోటల్లో టిఫిన్ చేద్దాం!" సర్!" అన్నాడు. డ్రైవర్.

వెంకట సుబ్బయ్య ధనవంతుడే కాని పెద్ద పిసినారి! అందుకనే స్థోమత ఉండి కూడా ఈ పాతకారు కొన్నాడు.

"చిన్నప్పుడు మా బామ్మ చద్దన్నం తింటే బలమని చెప్పింది. కారు నడపడానికి బలం కావాలి కదా అని ఈరోజు నేను చద్దన్నం తిన్నాను. నీకు యధాశక్తి టిఫిన్ పెట్టిస్తాను నడు!" అన్నాడు సుబ్బయ్య.

ఆరోజు కారు నడపడమై యింటికి వచ్చేశారు. "అయ్యగారూ! చాలా అవసరంలో ఉన్నాను ఓ రెండువేల రూపాయలు యివ్వండి" అన్నాడు డ్రైవర్.

ఈ విషయం లోపలికి వచ్చి భార్యకి చెప్పాడు. "ఇవ్వండి! ఈ డ్రైవింగ్‌లో వున్న కిటుకులు నేర్పకపోతే ప్రమాదం!" అంటూ తన మంగళ సూత్రాలు కళ్ళకద్దుకుంది.

మిసెస్ సుబ్బయ్య.

"నేను మళ్ళీ సద్దుబాటు చేస్తా"నంటూ, ఓ అయిదు వందలు చేతిలో పెట్టాడు, సుబ్బయ్య.

ఆ మర్నాడు డ్రైవింగ్ పాఠాలయి పోయిన తర్వాత యింకో అయిదు వందలు పట్టుకు పోయాడు. డ్రైవర్.

మూడో రోజు నుండి రావడం మానేశాడు. వెయ్యి పట్టుకుపోయి, రావడం మానేశాడని సుబ్బయ్య బాధపడ్డాడు. కాని కారు ఎక్కి కూర్చున్నాడు. కారు స్టార్ట్ కాలేదు! ఏభయి వేల ఖరీదు గల కారు దానంతట అదే ఎన్నిరోజులు స్టార్ట్ అవుతుంది!

"నేను మొండి పిసినారిని, నువ్వు స్టార్ట్‌కాకపోతే ఊరుకుంటానా!" అనుకుంటూ తన భార్యని కారు తొయమన్నాడు.

"మాపుట్టింటి వాళ్ళ కారే తొయ్యలేదు! మీ కారు తోస్తానా, ఆశ దోశ అప్పడం", అంది చిలిపిగా.

"నిన్న కాక మొన్ననే కదా ముచ్చటపడి ఈకారు కొన్నారు అప్పుడే తోసేదాకా వచ్చిందన్నమాట. పక్కవాళ్ళం, మాకు తప్పేదేముంది!" అని వాళ్ళు తోశారు, ఎప్పటికైనా ఓ లిఫ్ట్ యివ్వక పోతాడా, సుబ్బయ్య అని.

సుబ్బయ్య కారు నడిపే విధానం చూసి డ్రైవింగ్ అబ్బలేదని ఆ వీధిలోని కొంత మంది అరుగులు ఎక్కేసేవారు. కారు దేనికయినా గుద్దించేస్తే ఏం ఆఘాయిత్యం చూడవలసి వస్తుందోనని, యిళ్ళల్లోకి వెళ్ళిపోయి, కిటికి తలుపులు కూడా వేసుకుని, యింట్లో దేవుడ్ని తలచుకుంటూ కూర్చునేవారు.

ఓసారి కారు తీసుకుని వెళ్ళిన వెంకటసుబ్బయ్య రెండు గంటలైపోయినా తిరిగి యింటికి రాలేదు.

"మావారెక్కడైనా కనిపించారా" అంటూ, వీధిలో కనిపించిన వారిని అడగడం మొదలెట్టింది శ్రీమతి సుబ్బయ్య.

ఎవరో ఒకాయన "ఓ గంట క్రితం మార్కెట్లో చూసాం! ఏదో సైకిల్‌ని గుద్దినట్లున్నారు" అని చెప్పాడు.

వెంటనే ఓ నాలుగు వేలు పట్టుకుని వెత్కుంటూ బయల్దేరింది. శ్రీమతి సుబ్బయ్య.

మొత్తం మీద భర్తని పట్టుకుంది కాని అక్కడ వాళ్ళు అతన్ని వదిలేటట్లు లేరు.

"ఓ అయిదువందలిస్తాను సైకిల్ బాగుచేయించుకో!" అంటున్నాడు సుబ్బయ్య.

"ఇదేమైనా భిక్షం వేస్తున్నావా, అసలు ఓ కొత్త సైకిల్ కొనియ్యి! అయిదు వందలు ఏ మూలకి! పైగా వైద్యం మా సొంత ఖర్చులతో చేయించుకోమంటావా! అన్నాడు ఆ సైకిల్ గలాయన.

శ్రీమతి సుబ్బయ్య, అసలు సుబ్బయ్య ఆమె భర్తకానట్లు, మధ్య వర్తిత్వం నడుపుతున్నట్లు నాటకమాడి, ఓ పదిహేను వందలకి ఒప్పించింది.

ఈసారికి వెంకట సుబ్బయ్య ఆ గొడవలోంచి బయటపడ్డాడు. "నేను ఎన్నాళ్ళని ఈ మంగళ సూత్రాలు కళ్ళకద్దుకుంటూ, దేవుడ్ని ప్రార్థిస్తాను! ఈ కారు నడపడం మానేసి ఓ డ్రైవర్ని పెట్టుకోండి" అంది శ్రీమతి సుబ్బయ్య. ఆ సైకిల్ వాడికి పదిహేను వందలు యిచ్చేశామని దిగులుతో ఓ పదిరోజులు మంచం పట్టేశాడు సుబ్బయ్య.

ఓ ఇరవై రోజుల తర్వాత కారు స్టార్టు చెయ్యడానికి ప్రయత్నం చేశాడు. కారు కొంచెం కూడా దాని స్వభావం మార్చుకోలేదు. స్టార్ట్ కాలేదు! తన భార్యని తొయ్యమని అడుగుదామనుకున్నాడు.

"ఏమిటో కారు తొయ్యదు! ఉద్యోగమూ చెయ్యదు! వంట సరే సరి, అదికూడా రాదు! అసలెందుకు పుట్టిందో అనుకుని, "తన కోసమే పుట్టానని" చాలాసార్లు ఆమె చెప్పిన విషయం గుర్తుకొచ్చి సంబరపడ్డాడు.

ఆ వీధిలో కొంచెం ముందుకెళ్ళి తోసేవారెవరైనా కనిపించక పోతారా అని వెతకడం మొదలెట్టాడు.

ఇద్దరు చదువుకుంటున్న విద్యార్థుల్ని అడిగాడు. "అప్పుడే ఆరున్నర అవుతోంది! ఇంకో రెండు గంటలలో ఎంసెట్ పరీక్షకి బయల్దేరాలి. ఒక్క నిముషం ఆలస్యమైనా పరీక్ష రాయడానికి అనుమతివ్వరు! తర్వాత ఎప్పుడైనా తోస్తాంలెండి ఈసారికి దయచేసి మమ్మల్ని వదిలెయ్యండి!" అన్నారు వాళ్ళు.

బయల్దేరిన వేళావిశేషం బాగా లేదని చెప్పి, యింటికెళ్ళి చద్దన్నం తిని, ఓ గంట తర్వాత ఎవరి చేతనో కారు తోయించుకుని బయల్దేరాడు.

సుబ్బయ్య కారు నడుపుకుని వెళ్తూంటే అదేం దురదృష్టమో, కారు వెళ్ళి వెళ్ళి ఆ యిద్దరు స్టూడెంట్స్‌కి తగిలింది. పరిగెట్టుకుంటూ వాళ్ళింటికి వెళ్ళి పెద్దవాళ్ళకి జరిగిన విషయం చెప్పి వాళ్ళని తీసుకు వచ్చాడు. పిల్లల్ని హాస్పిటల్‌లో చేర్చారు.

కారు తొయ్యమంటే తొయ్యలేదన్న కోపంతో పిల్లల్ని గుద్దేసినట్లు కేసుపెట్టారు వాళ్ళు. సుబ్బయ్య తీరుకి భయపడి పోయిన ఆ వీధిలోని కొంతమంది ఇళ్ళు ఖాళీ చేసి వెళ్ళిపోయారు.

తర్వాత చాలా గొడవలయ్యాయ్! ఆఖరికి, ఆ కారుని రెండు కిలోల పీచు మిఠాయికి అమ్మేశాడు, సుబ్బయ్య.

ఆ పీచు మిఠాయి, శ్రావణమాసం శనగలతో పాటు పంచి పెట్టింది, శ్రీమతి సుబ్బయ్య.

(ఆంధ్రభూమి వారపత్రిక 13-12-2012)